

వలంటీర్లకు కాకతీయ కట్టడాల గురించి వివరిస్తున్న ప్రొఫెసర్ ఉజ్వలఖాట్

## కాకతీయ కట్టడాలపై వలంటీర్లకు అవగాహన

వెంకటాపూర్, అక్టోబర్10: రాష్ట్రంలోని కాకతీయ కట్టడాలపై వలంటీర్లకు మంగళవారం అవగాహన కల్పించారు. మండలంలోని రామప్ప ఆలయంలో నిర్వహిస్తున్న వలంటీర్ల క్యాంపెయిన్ 9వ రోజు కొనసాగింది. ఇందులో భాగంగా మంగళవారం యోగా గురువు రాంబాబు యోగాలో శిక్షణ ఇచ్చారు. కాకతీయ కట్టడాలపై కేయూ ప్రొఫెసర్ విజయబాబు, ప్రొఫెసర్ ఉజ్వల ఖాట్ వలంటీర్లకు వివరించారు. కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు శ్రీధర్‌రావు, శ్రీనివాస్, సేవా టూరిజం అధ్యక్షుడు కుసుమ సూర్యకిరణ్, కేయూ టూరిజం స్కాలర్ ప్రశాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 6 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

హనుమకొండ సిటీ, అక్టోబర్10: ఈనెల 16 నుంచి 26 వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్ హై, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్రావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ప్రవేశం పొందిన స్టడీ సెంటర్ నుంచి హాల్ టికెట్స్ తీసుకోవాలన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఉమ్మడి జిల్లాలో పదో తరగతి పరీక్ష కేంద్రాలు 6 ఏర్పాటు చేయగా 422 మంది విద్యార్థులు హాజరుకాను న్నారు. ఇంటర్మీడియట్‌కు ఆరు పరీక్ష కేంద్రాల్లో 597 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

## సేవా సంస్థకు బస్సును బహూకరించిన ఎల్ఐసీ

న్యూశాయంపేట, అక్టోబర్ 10: గ్రేటర్ 49వ డివిజన్ జాలైవాడలోని బన్ను న్యూరో హెల్త్ రిహాబిలిటేషన్ ఇనిస్టిట్యూట్‌కు ఎల్ఐసీ మంగళవారం బస్సును బహూకరించింది. సేవా కార్యక్రమాల్లో సంస్థ ఎప్పుడు ముందుండి సహకారం అందిస్తుందని ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోనల్ మేనేజర్ ఎల్‌కే శ్యామ్‌సుందర్ తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఏనుగుల మానసారాంప్రసాద్, బన్న సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ చరణ్‌జిత్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఈవీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ వీ కిరణ్‌కుమారి, ప్రెసిడెంట్ బీ చంద్రజిత్‌రెడ్డి, ఎల్ఐసీ రీజినల్ మేనేజర్ ఉతుప్ జోసెఫ్, డీఎం ఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



బస్సు తాళాన్ని సంస్థకు అందజేస్తున్న ఎల్ఐసీ బృందం

## కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డుల సస్పెన్షన్

**గంజాయి స్మగ్లర్ల నుంచి డబ్బులు తీసుకున్నందుకే..**

సుబేదారి,అక్టోబర్ 10: గంజాయి స్మగ్లర్ల నుంచి డబ్బులు వసూలు చేసిన కేయూసీ కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులను పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ సస్పెండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొద్ది రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ నుంచి స్మగ్లర్లు కారులో నాలుగు కిలోల గంజాయిని రెండు వేర్వేరు ప్యాకెట్లతో తరలిస్తుండగా కానిస్టేబుల్ కే వాసు, హోంగార్డులు బీ అనిల్, జీ అనిల్ వడ్డేపల్లి ప్రాంతంలో పట్టుకున్నారు. స్మగ్లర్లను బెదిరించి డబ్బులు వసూలు చేసి, కొంత గంజాయిని తీసుకొని వదిలేశారు. ఇదే గంజాయి ముఠా నర్సంపేటలో పోలీసులకు పట్టుబడడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వీరిపై పోలీసు అధికారులు చేపట్టిన విచారణలో నిజమని తేలడంతో సీపీ సస్పెన్షన్ వేటు వేశారు.

## అనుమతి లేకుండా కమిషనరేట్‌కు రావద్దు: సీపీ

సుబేదారి, అక్టోబర్10: పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఫిర్యాదులు చేయడానికి ముందస్తు అనుమతి తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిబంధనలు అమలవుతున్న సందర్భంగా అనుమతి లేకుండారావద్దన్నారు. అత్యవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, ఏసీపీ, డీసీపీ స్థాయి అధికారులకు పిర్యాదు చేయాలన్నారు. అక్కడ సరైన స్పందన లేకపోతే తమ ఫిర్యాదులను 8712685100 వాట్సాప్ నంబర్‌కు సంక్షిప్తంగా పంపించాలని సీపీ సూచించారు. వాటిని పరిశీలించిన తర్వాత ప్రత్యక్షంగా కలవడానికి కేటాయించిన సమయంలో సీపీ కార్యాయానికి రావాల్సి ఉంటుందన్నారు.

# జనగామకు ప్రగతి ప్రదాత

- 16న ముఖ్యమంత్రి కేసీఆర్ రాక
- ఉమ్మడి జిల్లాలో తొలి ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్న సీఎం
- నేడు పట్టణంలో నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశం
- పాల్గొననున్న మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి
- బీఆర్‌ఎస్ రెండు సభల కోసం ఏర్పాట్లు
- వికాస్‌నగర్ వద్ద కేసీఆర్ బహిరంగ సభ



కేసీఆర్ సభ కోసం భూమిని చదును చేస్తున్న డోజర్లు

జనగామ, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల నగారా మోగగానే బీఆర్‌ఎస్ దూకుడు పెంచింది. సీఎం కేసీఆర్ 16న జనగామలో జరిగే సభలో పాల్గొననున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి తొలి ఎన్నికల శంఖారావాన్ని ఇక్కడి నుంచే పూరించే అవకాశం ఉన్నది. సీఎం పర్యటన ఖరారు కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నయా జోష్ మొదలైంది. సీఎం బహిరంగ సభను విజయవంతం చేసేందుకు బుధవారం జిల్లా కేంద్రంలోని వికాస్‌నగర్‌లో ఉదయం 11 గంటలకు సన్నాహక సమావేశం సహా జనగామ నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలతో కీలక సమన్వయ సమావేశం జరుగనున్నది. రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రె డ్డి, స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హాజరుకానున్నారు. ఒకనాడు కరువుగడ్డగా ఉన్న జనగామ కోనసీమ తరహాలో పచ్చగా చేసిన అభివృద్ధి ప్రదాత కేసీఆర్ రానుండడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొన్నది. తొలి జాబితాలోనే పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఇద్దరు దమ్మున్ననేతల పేర్లను ప్రకటించిన అధినేత, తాజాగా జనగామ స్థానం నుంచి పల్లా అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంతో జిల్లాలో గులాబీ పార్టీ మూడు సీట్లు గెలిచి 'తీన్‌మార్' కొట్టేందుకు సిద్ధమైంది. ఆయా నియోజకవర్గాల్లో జనంలో పట్టున్న వారికే బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా పట్టం గట్టడడంతో గెలుపు ఖాయమైనా..మెజార్టీ లక్ష్యంగా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఈ మేరకు సీఎం ఎన్నికల బహిరంగసభ, సన్నాహక సభ కోసం అక్కడే మైదానాన్ని చదును చేస్తున్నారు. సీఎం సభాస్థలి వద్ద బందోబస్తు, హెలిప్యాడ్ వంటి ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం జనగామ ఏసీపీ దేవేందర్ రెడ్డి, అర్బన్ సీఐ శ్రీనివాస్ తదితరులు పరిశీలించారు.

**బీఆర్‌ఎస్ హుషారు.. ప్రతిపక్షాల బేజారు**

ఇప్పటికే గులాబీ పార్టీ మిగతా పార్టీల కంటే ముందే టికెట్లు ఖరారు చేసి సమరానికి సై అంటూ కదన రంగంలోకి దూకింది. ఇంకా ఎవరికి ఇవ్వాలో తేల్చుకునేలోపే మంత్రులు, ఎమ్మెల్యేలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి నియోజకవర్గాల్లో విస్తృత పర్యటనలు చేపట్టారు. అర్ధరాత్రి వరకు బిజీబిజీగా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి రూ.వందల కోట్ల పనులు చేపట్టారు. షెడ్యూల్ వచ్చే వరకు ప్రజల మధ్య ఉండి వారి సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు ఆగకూడదని పేదలకు ఇబ్బందులు కలిగించొద్దని దళితబంధు, గృహలక్ష్మి, బీసీబంధు కార్యక్రమాలతో క్యాంపు కార్యాలయాలు జనంతో నిండిపోయాయి. కాంగ్రెస్, బీజేపీలకు షాక్ ఇస్తూ వందల మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరేందుకు క్యూ కడుతున్నారు. 2018లో గులాబీ పార్టీని ఆదరించినట్లుగానే ఈసారి ఎన్నికల్లోనూ జిల్లా ప్రజలు బీఆర్‌ఎస్ వెంటే ఉంటారన్న విశ్వాసాన్ని గులాబీనేతలు వ్యక్తం చేస్తున్నారు.

# పోలీసుల తనిఖీల్లో భారీగా నగదు పట్టివేత

- రూ. 17.36 లక్షలు స్వాధీనం
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆధారాలు చూపని నగదు సీజ్





పోచమ్మమైదాన్, ఊకల్ క్రాస్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పోచమ్మమైదాన్, అక్టోబర్ 10: వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు ఏసీపీ, మట్టెవాడ, ఇంతెజార్‌గంజ్, మిల్స్‌కాలనీ సీఐలతో పాటు పోలీసుల సిబ్బంది మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పోచమ్మమైదాన్ జంక్షన్ వద్ద నిర్వహించిన తనిఖీలో మూగల వేణు నుంచి రూ.3,00,000లు, మర్రి వెంకటయ్య కాలనీకి చెందిన బాబుల సుదర్శన్ వద్ద రూ. 4,50,060 చొప్పున మొత్తం రూ.7,50,060లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు. ఈ తనిఖీల్లో ఏసీపీ బోనాల కిషన్, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

***రూ. 3.45లక్షలు..***

గీసుగొండ: ఊకల్ క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం గీసుగొండ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా నగదు పట్టుబడింది. కొత్తగూడేనికి చెందిన జొన్నలగడ్డ మల్లికార్జున్ శాస్త్రి ఎలాంటి పత్రాలు లేకుండా తన కారులో రూ. 3 లక్షల 45 వేలను హైదరాబాద్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నగదును సీజ్ చేసినట్లు ఎస్సైలు వెంకన్న, శ్వేత తెలిపారు.

**రూ. 2 లక్షలు..**

సంగెం: పోలీసుల తనిఖీల్లో రూ. 2లక్షలను పట్టుకున్నట్టు ఎస్సై ఎం.భరత్ తెలిపారు. మండలంలోని తీగరాజుపల్లి కూడలిలో తనిఖీలు చేయగా, చెన్నారావుపేట మండలం కందిగడ్డతండాకు చెందిన గుగులోత్ స్వామీ నాయక్ కారులో రూ. రెండు లక్షలు దొరికాయి. వాటికి సంబంధించిన వివరాలు ఇవ్వకపోవడంతో సీజ్ చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు. .

***రూ.1,15,000ల నగదు సీజ్***

నర్సంపేట రూరల్: వాహనాల తనిఖీలో భాగంగా ఎలాంటి ఆధారాలు చూపని రూ.1,15,000ల నగదును నర్సంపేట పోలీసులు సీజ్ చేశారు. మంగళవారం ఎస్సై శీలం రవి ఆధ్వర్యంలో పట్టణంలోని నర్సంపేట–మహబూబాబాద్ రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించారు. దీంతో ఖానాపురం నుంచి నర్సంపేటకు వస్తున్న ఓ కారులో ఉన్న రూ.1,15,000ల నగదుకు సరైన పత్రాలు లేని కారణంగా వాటిని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

***రూ.3.26లక్షల నగదు స్వాధీనం***

పరకాల: పట్టణంలో రూ.3.26 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జూపల్లి వెంకటరత్నం పేర్కొన్నారు. పరకాలలో నిర్వహించిన తనిఖీల్లో రేగొండ మండలం పొనగల్లు గ్రామానికి చెందిన సూర కిరణ్ నుంచి రూ. 1,41,500, భూపాలపల్లి మండలం వేశాలపల్లికి చెందిన బోయిని రమేశ్ నుంచి రూ. 85వేలు, చిట్యాల మండలం చల్లగరిగ గ్రామానికి చెందిన బారిశెట్టి స్వరూప నుంచి రూ. 50వేలు, ఘనపూర్ మండల కేంద్రానికి చెందిన పాశికంటి రవీందర్ నుంచి రూ.49,500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నగదు ఆధారాలు చూపిన బారిశెట్టి స్వరూప, పాశివికంటి రవీందర్‌కు డబ్బులు తిరిగి అప్పగించామన్నారు.



కాజీపేట: రైలులో ప్రయాణికుల బ్యాగును తనిఖీ చేస్తున్న పోలీసులు

## రైళ్లల్లో పోలీసుల విస్తృత తనిఖీలు

***అనుమానితులను విచారించి పూర్తి చిరునామాల సేకరణ***

కాజీపేట, అక్టోబర్ 10: కాజీపేట రైల్వే జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లల్లో, ప్లాట్‌ఫాంపై మంగళవారం లా అండ్ ఆర్డర్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎన్నిక ల సంఘం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్డ్ ను విడుదల చేసిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించి, పూర్తి చిరునామాను సేకరించి వదలిపెట్టారు. ఈ తనిఖీల్లో ధర్మసాగర్ ఎస్సై ఫిలిప్స్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.